# తక్కిన ఇద్దరు

నరసింహారావు ఆ ఆఫీసులో చేరి రెండు సంవత్సరాలయింది. అతి కష్టం మీద ఆవుద్యోగం సంపాదించాడు. ఎన్నో ఆఫీసులు తిరిగి, ఎంతోమందిని దర్శించి, నానా అవస్థలూ పడితేనే గాని ఆ వుద్యోగం దొరకలేదు. బి.యే. ప్యాసయినా, తనకన్న తక్కువ చదువుకున్నవాళ్లు ఎక్కువ జీతం సంపాదించుకుంటూ వున్నా, చాలా కాలం వుద్యోగం లేకుండా అవస్థపడి వుండటంచేత, ఏదో ఒక వుద్యోగంలో, ఎంతో కొంత జీతంమీద చేరితేనే కాని లాభం లేదనీ, ఒకసారి యెక్కడో ఒకచోట చేరితే, తరువాత క్రమంగా పైకి పోవచ్చుననీ, అతడు ముప్పయి రూపాయిల జీతానికే — పాపం ఆ వుద్యోగంలో చేరాడు.

ఆ ఆఫీసులో అతడు చేరేటప్పటికి, అంతకు పూర్వమే అయిదుగురు గుమాస్తాలు వున్నారు. నరసింహారావు ఆరోవాడు. ఇతను చేరిన తరువాత, యీ రెండేళ్ళలోనూ ఇద్దరు గుమాస్తాలు అక్కడ పని మానుకొని, ఎక్కువ జీతాలమీద ఇంకెక్కడో చేరారు. ఆ ఇద్దరూ పనిమానుకున్నప్పుడు, నరసింహారావు, తన యజమాని దగ్గరకువెళ్ళి తనకు కొద్దిగానైనా, జీతం ఎక్కువ చెయ్యమని అర్థించాడు. కాని, ఆ కొరకరాని కొయ్య యజమాని దగ్గర అదేమీ లాభించలేదు.

నరసింహారావు చేస్తున్న పనికి తాను ఇచ్చే జీతమే చాలా ఎక్కువన్నట్లు మాట్లాడాడు ఆ యజమాని.

నరసింహారావు మాత్రం, యీ అభిప్రాయంతో ఎంతమాత్రమూ ఏకీభవించక పోయినా, ప్రస్తుతం ఆ వుద్యోగం వదిలిపెట్టివేస్తే, తాను చేతిలో వుద్యోగం ఏమీలేక అవస్థపడవలసి వస్తుందని, కిక్కురుమనకుండా వూరుకున్నాడు.

బియ్యం ధర పెరిగింది. నెయ్యిధర హెచ్చింది. గుడ్డల ఖరీదు ఒకటికి

నాలుగు రెట్లయింది. ఇంటి యజమాని ఇంకొక నాలుగు రూపాయలు ఎక్కువ ఇస్తే సరి, లేకపోతే ఇల్లు ఖాళీ చెయ్యమన్నాడు. నరసింహారావు జీతం మాత్రం ఎదుగూ, బొదుగూ లేకుండా అలాగే వుంది. పగలు ఆఫీసులో పనిజేస్తూ వున్నంతసేపూ, చాలా తక్కువ జీతానికి, విపరీతంగా ఎక్కువ చాకిరీ చేస్తున్నానే అనే రోషంతోనూ, ఇంట్లో వున్న కాస్సేపూ, ఇంటిఖర్చుకు సరిపోయే మాత్రమేనా సంపాదించలేక పోతున్నానే అనే బెంగతోనూ నరసింహారావు తపనపడి పోతున్నాడు.

నరసింహారావు భార్య చాలా మర్యాద తెలిసిన మనిషి కనక, తనచేతనైనంతవరకు మగని మనస్సుకు కష్టం కలిగించకుండానే సంసారం గడపడానికి ప్రయత్నిస్తోంది. కాని అది ఒక మాత్రాన సాధ్యమా. యాభైరూపాయల ఖర్చు యాభైరూపాయలే. ముప్ఫయిరూపాయిల సంపాదన ముప్ఫయి రూపాయలే.

ఈసారి ఎలాగయినా సరే యజమానితో మాట్లాడి జీతం యెక్కువ చేయించుకోవాలని నిశ్చయించుకున్నాడు.

యజమాని దగ్గరకు వెళ్ళాడు. కొంచెంసేపు నిలుచున్నాక, “ఏమిటి ?” అని అడిగాడు యజమాని.

కొంచెం తడబడి మెల్లిగా గొంతు సవరించుకొని “వస్తువుల ఖరీదులన్నీ చాలా పెరిగిపోయాయండి” అన్నాడు.

ఆ యజమాని, దేవాంతకుడు. నరసింహారావు ఏమి అడగదలచుకున్నాడో గ్రహించి, ముందరి కాళ్ళకి బంధంగా “అవును. చాలా పెరిగిపోయాయి. ఆఫీసు ఖర్చులు కొంత తగ్గించుకోవాలని ఆలోచిస్తున్నాను. ఏమీ పాలుపోవటం లేదు” అన్నాడు.

నరసింహారావుకి, గొంతులో ఏదో అడ్డంపడినట్లయింది—కాని గొంతు సవరించుకొని, మరి కొంచెం ధైర్యం తెచ్చుకొని, “నాకు జీతం బొత్తిగా చాలటం లేదండి. ఇంక్రిమెంటు ఏమైనా ఇస్తేనేగాని, బొత్తిగా గడిచేటట్టు లేదు. మీ ఆఫీసులో చేరి రెండేళ్లయింది. పైగా, నేను చాలా కష్టపడు

తున్నాను కూడాను. ముగ్గురు మనుష్యులపని చేస్తున్నాను నేను ఒకణ్ణీని” అని అన్నాడు, నరసింహారావు మొహం చూస్తూ.

“నరసింహారావు, అఫీసు ఖర్చు చాలా ఎక్కువ అయిందని ఇప్పుడేకదా, నీకు చెప్పాను. నువ్వు ఒక్కడివీ ముగ్గురు గుమాస్తాల పని చేస్తున్నా నంటున్నావ్. ఆ తక్కిన ఇద్దరూ ఎవరో చెప్పు-వాళ్ళని తీసిపారేస్తాను. ఆఫీసు ఖర్చు కొంతేనా తగ్గుతుంది” అన్నాడు యజమాని.

నరసింహారావు నోట మాట లేక అలాగే నిలుచున్నాడు.

# బంగారు నాణెం

జూదం జోరుగా సాగిపోతోంది. అతడి దగ్గర వున్న డబ్బు క్రమక్రమంగా తగ్గిపోతోంది. మిగతా వాళ్ళ జేబులు బరువెక్కుతున్నాయి. బల్లమీద అతడు పెట్టిన నోట్లన్నీ హరించిపోతున్నాయి.

అతడు పెద్ద జమీందారీ కుటుంబంలో పుట్టినవాడు. జమీందారులందరిలాగానే త్రాగుడూ, జూదమూ అలవాటు చేసుకున్నాడు. సాటి జమీందారులందరికీ, కళ్ళుకుట్టే ఆస్తినంతనూ పాడుచేసుకున్నాడు. ఈనాడు అతడు జేబులో వేసుకువచ్చిన సొమ్ము కాస్తా జూదపు బల్లమీద హరించి పోయిందంటే, మరునాడు అకడు తిండికికూడా లేకుండా ఇబ్బంది పడవలసిందే. అంచేత వెర్రి ఆవేశంతో ఆడుతున్నాడు. కాని, అతడికి ఆవేశం ఎక్కువ అయిన కొద్దీ నష్టం ఎక్కువ అవుతోంది. జేబులో వున్న నోట్లకట్ట పూర్తిగా అయిపోయేటప్పటికి, పాపం ఆ ఆవేశంకూడా అంతా తగ్గింది. జేబులో డబ్బులు అయిపోయి, ఆవేశం పూర్తిగాతగ్గి జూదమాడడానికి వీలులేక అతడు ఏంచేద్దామా అని గడియారం చూసేటప్పటికి పన్నెండు గంటలయింది. ఏమీ పాలుపోక అతడు వీధిలోకి వచ్చాడు. చీకటి దట్టంగావుంది, మంచు ఒత్తుగా పడుతోంది. వీధి చాలా ప్రశాంతంగావుంది. తన అడుగుల చప్పుడుతో, వీధిలోని ప్రశాంతతను భగ్నపర